కథ

# లేత మనసులు

పి. సుభాషిణి

'హా... హో హో.. హో!' రొప్పుతూ పరుగెడుతున్నాడు ఓ వ్యక్తి.

''వేసేయండ్రా.. వదలొద్దు.. నరకండి..'' వేటకొడవళ్ళు, కత్తులు పట్టుకుని అతడి వెంటపడి తరుముతున్నారు పది మంది వ్యక్తులు.

ఆ వ్యక్తికి, గుంపునకు మధ్య దూరం తగ్గింది. వేట కొడవలి ఒకటి ఆ వ్యక్తి వీపును చేరింది. అతడు ముందుకు తూలిపడ్డాడు.

కొడవళ్ళు ఒక్కసారిగా దాడిచేసాయి.

చావుకేకలు ఆ ప్రదేశమంతా మారుమ్రోగాయి.

ఆ వ్యక్తి శవంగా మారాడు.

గుంపులోని ఒకడు శవాన్ని కాలితో తన్నాక తల తిప్పి నల్లటి లావుపాటి ఆకారంకేసి చూసి చెప్పాడు ''దాసన్నా! చచ్చిండు''

దాసు ముఖంలో పైశాచిక ఆనందం కదలాడింది. ''పదండ్రా! పెద్దయ్యకీ విషయం చెపుదాం. అయ్య ఖుషీ అవుతాడు. మనకీరోజు మజానే''


అందరూ వెనుతిరిగారు.

ముందు నడుస్తున్న దాసు చేతిలోని వేట కొడవలి చివర అంచునుండి ఓ నెత్తుటిబొట్టు మెల్లగా జారి నేలకు తాకింది.

★ ★ ★

''పసి వయసులో పిల్లలకు తల్లిదండ్రులే లోకం. అనేక విషయాలలో వాళ్ళు తను పేరంట్స్‌ని ఫాలో కావాలని కోరుకుంటారు. ముఖ్యంగా హింసాప్రవృత్తి, అవినీతి, దుర్వ్యసనాలు తల్లిదండ్రులకంటే, అవి చాలా సులభంగా పిల్లలకి అలవడుతాయి'' చెప్పడం ఆపి దేవసేన ముఖంలోకి చూసాడు చైల్డ్ సైకియాట్రిస్ట్ డాక్టర్ వేణుగోపాల్.

ఆమె నెమ్మదిగా తలాడించింది. ఆరేళ్ళ కొడుకు నిహాల్ కళ్ళ ముందు కదలాడాడు. ఫ్రిజ్‌లో నుండి తీసిన విస్కీ గటగటా వాడు తాగేయడం గుర్తుకొచ్చింది. మనసంతా అదోలా అయిపోయింది.



దేవసేన భర్త రాహుల్ బిజినెస్‌మేన్. డ్రింక్ చేయడం అతడికున్న వ్యసనం. అదేదో బయట తాగేసి రావడం, బార్‌కెళ్ళి రావడం చేస్తే తనకీ సమస్యే వచ్చేది కాదు. డ్రింక్ చేయడం తప్పు కాదనే ఫిలాసఫీ తనది. 'తనేం తప్పు చేయనప్పుడు, భయపడాల్సిన పని లేదని, దాచవలసిన అవసరం లేదని' అతడు అంటుంటాడు. అందుకే ఇంట్లోనే బార్ ఓపెన్ చేసాడు. రాత్రి ఎనిమిది నుండి పదకొండింటి వరకూ మద్యపాన కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగుతుంది.

ఇంట్లో నాలుగు గోడల మధ్య డ్రింక్ చేయడం తప్పో, ఒప్పో తనకు తెలియదు. తన కొడుకు నుండి సమస్య రాకపోతే ఆ పద్ధతికి ఆమె కూడా అలవాటుపడిపోయి 'ఇది నేటి కల్చర్' అని సరిపెట్టుకుని వుండేది. తనకు సమస్య ఊహించని వైపునుండి వచ్చింది. ఆరేళ్ళ తన కొడుకు నిహాల్ ఓ రోజు విస్కీ బాటిల్ తీసి గటగటా తాగేయడం చూసింది.

మొదట పిల్లవాడు అలా పొరపాటున తాగేడేమోనని కోప్పడింది. ''అది నాన్నగారిది. పెద్దవాళ్ళు మాత్రమే అది తాగాలి. నువ్వు తాగకూడదు. నువ్వు మరోసారిలా చేస్తే కొడతాను'' అంటూ బెదిరించింది. అప్పటి నుండి వాడిమీద ఓ కన్నేసి వుంచింది. వాడు తప్పు చేస్తున్నట్టుగా అనిపించలేదు.

నెల తర్వాత ఓ అర్ధరాత్రి ఏదో అలికిడి విన్పించింది, తల పక్కకు తిప్పి చూస్తే బెడ్‌మీద నిహాల్ లేడు. ఆమె కాస్త కంగారుపడింది. బహుశా బాత్‌రూమ్‌కి వెళ్ళాడేమోనని మనసు సరిపెట్టుకుంటూ వుంటే, చప్పున ఏదో తోచింది. అదిరిపడి లేచింది. ఒక్క అంగలో హాల్లోకి వెళ్ళింది.

నిహాల్ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడు.

ఆవేశం పట్టలేక వాడికి రెండు తగిలించేసరికి తను షాకయ్యే విషయమూ బయట పెట్టేసాడు. ఈ నెలరోజులుగా అర్ధరాత్రి లేచి గుట్టు

చప్పుడు కాకుండా వచ్చి తాగేసి వెళ్ళి పడుకుంటు న్నాడని.

తెల్లవారి కాస్త ఆలస్యంగా నిద్రలేస్తున్నా అది వాడి బద్ధకమే అనుకుంది గానీ, తనకు ఏమా త్రమూ అనుమానం రాలేదు. అనుమానం రాకుండా మేనేజ్ చేశాడు వాడు.

ఆ సమయంలో ఎంత కొట్టినా ఫలితం ఉండ దని తనకి తెలుసు. అందుకే తనికమీదట మరింత జాగ్రత్తగా వుండదలుచుకుంది. కానీ అర్ధరాత్రి వేళ వాడు నిద్రలేవడం, ఆ తర్వాత నిద్రపట్టక అల్లాడి పోవడం చూసాక సైకియాట్రిస్ట్‌ను కల వడమే మేలని నిర్ణయించుకుంది.

అలా డ్యాక్టర్ వేణుగోపాల్ దగ్గరకు వచ్చింది. ఆయన చెప్పింది విన్నాక తనేం చేయాలో పాలుపోవడం లేదు.

''మరి..మరిప్పుడు నన్నేం చేయమం టారు?''

''మీవారిని ఓసారి తీసుకురండి. ఇప్పుడు మెడిసిన్ మీ పిల్లవాడికి, కౌన్సి లింగ్ మీవారికి అవసరమనుకుంటు న్నాను''

''ఆయన వస్తారో, రారో..'' ఆమె సందిగ్ధంగా ఆగింది.

''కొడుకు పరిస్థితిలో మార్పు కోరుకునే ఏ తండ్రయినా వస్తాడనే నా నమ్మకం''

''ప్రయత్నిస్తాను'' దేవసేన సెలవు తీసుకుని వెళ్ళిపోయింది.

★ ★ ★

రాహుల్‌ని చూడడంతోనే అతడు ఓ మొండివా డని అర్థమయ్యింది. డ్యాక్టర్ వేణుగోపాల్‌కి. కాసేపు పిల్లవాడి పరిస్థితి చర్చించాక అతడితో అన్నాడు. ''మీ అబ్బాయి పరిస్థితి మీకు తెలిసే వుంటుంది. ఆరేళ్ళ వయసుకే తనకు ఆల్కహాల్ అలవాట య్యింది. ఇప్పుడు తను మందు పడనిదే నిద్రపో లేని స్థితికి చేరుకున్నాడు. మెడిసిన్ ద్వారా ఆ అల వాటును మాన్పించవచ్చు. కానీ వాడి మనసులో నుంచి 'డ్రింక్' అన్న పదాన్నే తొలగించాలి. అందుకు మీరు సహకరించాలి''

''నేనేం చేయాలి?'' అడిగాడు రాహుల్.

''డ్రింక్‌ని ఇంట్లో వుంచుకోకూడదు. అలాగే 'మీరింత కాలం తప్పు చేసారని' ప్రతి రోజూ చెపుతూ మీ పిల్లవాడి మైండ్ సెట్ మారేలా చేయాలి.''

అతడు నవ్వాడు ''నేను...నేను తప్పు చేసానని నా కొడుకు...అంత చిన్నవాడి ముందు ఒప్పుకో వాలా? సారీ! ఏదో పొరపాటు జరిగివుండొచ్చు గానీ, అంత మాత్రాన నేనేదో తప్పు చేసా నని..ఊహూ! నా కేరెక్టర్‌ని నేను తక్కువ చేసుకో లేను. ఒక్కసారి అలా మెట్టు దిగితే పసివాడి ముందు కూడా నా కేరెక్టర్ పడిపోతుంది.''

ఎంత చెప్పినా అతడు తనను తాను సరిదిద్దుకో వడానికి అంగీకరించకపోయేసరికి డ్యాక్టర్ వేణుగో పాల్‌కి అసహనం లాంటిది కలిగింది. ''మిస్టర్ రాహుల్! దేవుడు పిల్లలను ఈ లోకంలోకి పంపినా, వారికి మంచి చెడులు చెప్పి, తీర్చిదిద్దే అవకాశం తల్లిదండ్రులకే ఇచ్చాడు. మనం వారికి మంచి చెపితే మంచివాళ్ళవుతారు. చెడు చెపితే చెడ్డ వాళ్ళవుతారు. సాధారణంగా ప్రతి పేరెంట్ పిల్లల ముందు తమను తాము మంచివారిగా ఎక్స్‌పోజ్ చేసుకోవడానికే ప్రయత్నిస్తారు. అందుకే పిల్లలు పేరెంట్స్‌లో ఒకరిని 'రోల్ మోడల్'గా భావిస్తారు. మీరు గమనించారో లేదో డ్యాక్టర్స్ పిల్లలు ఎక్కువగా డ్యాక్టర్స్ అవుతుంటే యాక్టర్స్ కొడుకులు యాక్టర్సే అవుతున్నారు. బిజినెస్ మేన్ బిడ్డలు ఆ రంగంలోనే ప్రవేశిస్తుంటే పొలిటీషియన్స్ పిల్లలు వారసత్వ సంపదను వదులుకోదలచుకోవడం లేదు. ఈ సృష్టిలో ప్రతి జీవి అనుకరణ ద్వారా అనేకం నేర్చుకుంటుంది. మీ విషయంలో మీ బిజి నెస్ క్వాలిటీస్ నేర్చుకోవచ్చు. కానీ అంతకన్నా ముందే మీ దుర్వ్యసనాల పట్ల ఆకర్షితుడై అనుసరి స్తున్నాడు''

''నేనీ విశ్లేషణను ఒప్పుకోలేను'' తల అడ్డంగా ఆడించాడు రాహుల్.

''ఒప్పుకొని తీరాలి'' డ్యాక్టర్ గొంతులో మార్పు.

''ఎందుకని?''

''నా జీవితమే అందుకు ఒక నిదర్శనం కాబట్టి''

★ ★ ★


నీళ్ళ తొట్టె ముందు కూర్చుని వేట కొడవలికి అంటిన నెత్తురు కడు క్కుంటున్నాడు వీరదాసు. పూరిపాక తలుపు ముందు నిలబడి తండ్రినే చూస్తున్నాడు వేణు. తండ్రిని చూస్తుంటే తనకెంతో ఆశ్చర్యంగా గర్వంగా అనిపిస్తుంటుంది. తన ఫ్రెండ్స్ నాన్నలందరికీ తన నాన్నను చూస్తే భయం. ''నాన్న వేట కొడవలి పట్టుకుని రోడ్డమ్మట వెళ్తుంటే, వాళ్ళంతా భయం భయంగా పక్కకు తప్పుకోవడం, తను చాలాసార్లు చూసాడు. స్కూల్‌లో కూడా తను ఎవరినైనా కొడితే 'వాడు దాసు కొడుకు వదిలేయండ్రా..లేకపోతే వాడి నాన్న గొడవకొస్తాడు' అన డమూ తను విన్నాడు. అందుకే తండ్రిని చూస్తుంటే ఆనందం, ధైర్యమూ కలుగుతాయి.

వేణు నెమ్మదిగా తండ్రి దగ్గరగా వెళ్ళాడు ''నాన్నా! మళ్ళీ ఎవరినైనా నరికావా?''

''అవున్రా! ఓ కుర్రాడు మన

## హిందీ 'పోకిరి' పిల్ల షకీరా?

**'పోకిరి' సినిమాలో 'ఇప్పటికింకా నా వయసు' పాట ఎంత సంచలనం సృష్టిం చిందో తెలిసిందే! ఆ పాటలో డాన్స్ చేసిన ముమైత్‌ఖాన్ ఇవాళ బిజీ స్టార్. ఈ సినిమాని బోనీకపూర్ హిందీలో తీస్తున్న సంగతి తెలి సిందే! హిందీలో ఈ పాటకి ఇంగ్లీష్ పాప్‌స్టార్ 'షకీరా'తో డాన్స్ చేయించాలని బోనీ భావిస్తు న్నట్టు బాలీవుడ్ వార్తలు చెబుతున్నాయి. సల్మాన్ ఖాన్-ఆయేషా టకియా జంటగా నటిస్తున్న ఈ సినిమాని ప్రభుదేవా డైరెక్ట్ చేస్తు న్నాడు.**



పెద్దయ్య కూతురు వెంటపడి ఏడిపిస్తున్నాడట. అందుకే వాడి వెంటపడి తరిమి నరికేసా''

ఆ పసివాడి మనసులో చిరు అనుమానం అదే అడిగాడు. ''అంటే.. అంటే మనల్ని ఎవరైనా ఏడిపిస్తే, వాళ్ళను నరికి, చంపేయాలా?''

''అలా చేస్తేనే మనమీ లోకంలో బ్రతక గలుగుతాంరా బిడ్డా! మనల్ని చూసి అందరూ భయపడాలి. మన జోలికి ఎవ్వరూ రాకూడదు. వాడి జోలికెళితే అడ్డంగా నరికేస్తాడని భయముంటేనే.. ఎవ్వరూ మన జోలికి రారు''

గుడిసెలో నుండి పరుగెత్తుకొచ్చింది శ్యామలమ్మ. కొడుకు చేయి పట్టుకుని గుడిసెలోకి లాక్కుపోతూనే పెద్దగా గొణిగింది. ''అబ్బ చెడిపోయాడు. కొడుకునీ చెడగొడుతున్నాడు. పిల్లలకి చెప్పాల్సిన మాట లేనా అవి''

పెళ్ళాం మాటలు విని వీరదాసు పెద్దగా నవ్వాడు. ''వాడు నా వారసుడే- పులిబిడ్డ పులే అవుతుంది గానీ పిల్లి కాదు. వాడికీ ఇలాంటి మాటలే ఇష్టం''

గుడిసెలోకి వెళ్ళబోతున్న శ్యామలమ్మ ఆగి వెనక్కు చూసింది. ''చూడయ్యా! నా కొడుకుని నీలా ఎన్నటికీ కానివ్వను. వాడు పెద్ద చదువులు చదువుకుని, మంచి ఉద్యోగం చేయాలి... అంతే''

వీరదాసు మాట్లాడలేదు. నవ్వి ఊరుకున్నాడు.

★ ★ ★

గ్రామదేవత తిరునాళ్ళు మొదలయ్యాయి.

పిల్లలంతా జేబునిండా డబ్బు లేసుకుని కావలసినవన్నీ కొనుక్కుంటున్నారు.

వేణు తండ్రి దగ్గరకు వచ్చాడు ''అయ్యా! నాకు ఐదు రూపాయలు కావాలే'' మెల్లగానే అడిగాడు.

దాసు అప్పుడే పెద్దయ్య ఇంటి నుండి వచ్చాడు. ఒకడి మీద దాడి చేసినా ఫలితం లేకపోయిందని పెద్దయ్య అతడి మీద విరుచుకు పడ్డాడు. ఆ చిరాకుతో వళ్ళు తెలియనంతగా మందు కొట్టేసాడు. ఇంటికి రాగానే కొడుకు విసిగిస్తూ మాట్లాడడంతో తనకు పిచ్చి కోపం వచ్చింది. ఎవడిమీదో చూపించలేని కోపం కొడుకు మీద చూపిస్తూ ''రేయ్! విసిగించకుండా అవతలికిపో'' అరిచాడు.

ఫ్రెండ్స్ అందరూ కొంటుంటే తన దగ్గర డబ్బులు లేకపోవడం నామోషీగా వుంది. ఎల్లాగైనా డబ్బు తీసుకుని వెళ్ళి వాళ్ళ ముందు గొప్పగా చూపించాలనే కోరికుంది. ఎంతయినా తను పులి బిడ్డ.. తనకేం భయం?

''నాకు డబ్బులు కావాలే''

వీరదాసు కోపం ఆపుకోలేకపోయాడు. చెయ్యెత్తి కొడుకు చెంప చెళ్ళుమనిపించాడు. వేణు ఎగిరి ఓ మూలన పడ్డాడు. ''చంపేస్తాన్రోయ్! నాకే.. నాకే ఎదురుచెప్తావా? ఆ!''

వేణు పడినచోట అలాగే వుండిపోయాడు.

మత్తు అప్పటికే మనిషిని పూర్తిగా వశం చేసుకోవడంతో వీరదాసు మంచం మీద పడి క్షణాల్లో గుర్రుపెట్టసాగాడు.

వేణు మెల్లగా లేచి నిలబడ్డాడు. ''ఎవరైనా మనల్ని ఏడిపిస్తే వారిని నరికి చంపేయాలి. అలా చేస్తేనే మనమీ లోకంలో బ్రతకగలుగుతాం. మనల్ని చూసి అందరూ భయపడాలి.. వాడి జోలికి వెళితే అడ్డంగా నరికేస్తాడని భయముంటే ఎవ్వరూ మన జోలికి రారు''

చూరులో దోపి వున్న మురకత్తి ''రా రమ్మని'' పిలుస్తోంది.

'తన తండ్రిని చూస్తే జనమందరికీ భయం. అలాంటి తండ్రిని చంపితే.. జనం తనను చూసి ఇంకా.. ఇంకా ఎక్కువ భయపడతారు'

వేణు చప్పున వేట కొడవలి లాగాడు. ఒక్క అంగలో తండ్రి మంచం దగ్గరకు చేరాడు. కత్తి పైకెత్తాడు. చావుకేకతో ఆ పల్లె ఉలిక్కిపడింది.

పొలం నుండి అప్పుడే వాకిట్లోకి అడుగు పెట్టిన శ్యామలమ్మ ఆ దృశ్యం చూసి అవాక్కయ్యింది.

★ ★ ★

రాహుల్ గొంతు తడారింది. అతి కష్టం మీద గొంతు పెగల్చుకుని అనుమానంగానే అడిగాడు- ''అంటే.. అంటే ఆ వేణు?''

''ఈ డాక్టర్ వేణుగోపాల్ నేను చేసిన నేరాన్ని నా తల్లి నెత్తిన వేసుకుని జైలుకెళ్ళింది. శత్రువుల పని అని తప్పించుకోవచ్చు. కానీ అమ్మకు అది ఇష్టంలేకపోయింది. తన భర్త తనను హింసిస్తుంటే ఎదురు తిరిగి చంపేసానని పోలీసుల ముందు చెప్పింది'' కళ్ళలో నీళ్ళు తిరిగాయి ఆయనకు.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం గాఢతను సంతరించుకోసాగింది.

చాలాసేపటి తర్వాత ఆ గాఢతను తగ్గిస్తూ డాక్టర్ వేణుగోపాల్ కంటిన్యూ చేసాడు. ''చైల్డ్ సైకాలజీ చాలా భిన్నంగా వుంటుంది. పిల్లలందరూ ఒక్కలా ప్రవర్తించరు. కొందరు పిల్లలు కొన్ని విషయాలను అసలు పట్టించుకోరు. అవే విషయాలను మనసులోకి తీసుకుని రియాక్ట్ అవుతుంటారు. మరికొందరు పిల్లలు, మన పిల్లలు ఏ విషయాలపట్ల ఎలా స్పందిస్తున్నారో తెలుసుకుని వారిని సరిదిద్దుకోవాలి. లేకపోతే మన పిల్లల్ని మనం చెడగొట్టడమే కాదు ఈ సమాజానికి ఓ క్రిమినల్ని అందిస్తున్నాం. అని తెలుసుకోవాలి. మీ పిల్లవాడిలో చిన్ననాటి నన్ను నేను చూసుకున్నాను. అందుకే నా గతాన్ని మీకు చెప్పాను. మీరిక ఎలా రియాక్ట్ అవుతారో అది మీ ఇష్టం''

రాహుల్ కుర్చీలో నుండి లేచాడు. ఆయనకు చెయ్యి అందించాడు.

అతడేం మాట్లాడలేదు. కానీ ఆ తండ్రి మనసులో కదలాడిన భావోద్వేగం డాక్టర్ వేణుగోపాల్‌కి అర్థమయ్యింది.

☆

## పదేళ్ల తర్వాత...

**దాదాపు దశాబ్దం క్రితం వచ్చిన 'ప్రేమదేశం' సినిమా సంచలనం సృష్టించింది. ఈ సినిమాలోని పాటలకు థియేటర్లలో జనాలు ముఖ్యంగా కాలేజీ కుర్రకారు పూనకం వచ్చినట్టు డాన్సులు చేసేవారు. అలాంటి బంపర్ హిట్ చిత్రంలో జంటగా నటించిన టాబు-అబ్బాస్ మళ్లీ ఇన్నాళ్లకి జంటగా తెలుగు తెరపై కనిపించడం అంటే విశేషమే మరి. చంద్రసిద్ధార్థ దర్శకత్వం వహిస్తున్న సినిమాలో వీళ్లిద్దరూ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారిప్పుడు. ఈ సినిమాలో కామెడీ ఎక్కువగా వుంటుందిట. అలనాటి ఈ హిట్ పెయిర్ నేడు ఎలాంటి సక్సెస్ సాధిస్తుందో చూద్దాం!**

